క్లుప్తంగా

సంక్షేమ ప్రదాతకు స్వాగతం పలుకుదాం


షర్మిలారెడ్డి, రుడా చైర్ పర్సన్

రాజమహేంద్రవరం సిటీ: సంక్షేమ ప్రదాత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం రాజమహేంద్రవరం వస్తున్న నేపథ్యంలో ఆయనకు ఘనంగా స్వాగతం పలుకుదామని రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ఆయన పనిచేస్తున్నారన్నారు. మహిళలు, విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు.

డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ: ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ డైరీ, క్యాలెండర్‌ను కలెక్టర్ కె.మాధవీలత సోమవారం ఆవిష్కరించారు. ఈ సంఘ కార్యవర్గ సభ్యులు సోమవారం కలెక్టర్‌ను కలసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ఏ.ఉదయ బ్రహ్మం, రాష్ట్ర మాజీ కార్యదర్శి వి.అప్పయ్య శాస్త్రి, జిల్లా అధ్యక్షుడు పింగళి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు కె.డేవిడ్ లివింగ్‌స్టన్ ఉన్నారు.

భగవద్గీతపై అవగాహన

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో లిటరరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు సోమవారం భగవద్గీతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవ కుమారి మాట్లాడుతూ సమున్నత వ్యక్తిత్వ సాధనకు ప్రాచీన మహర్షులు అందించిన జీవనశాస్త్రం భగవద్గీత అని వివరించారు. కార్యక్రమంలో ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ బి.అనురాధ సూర్య కుమారి, లిటరరీ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ కె.నీరజ, ఏవీఎన్‌డీ.శ్రీనివాస్, ఆర్.రాజేశ్వరి, పి.కుసుమ కామేశ్వరి పాల్గొన్నారు.

ఉండ్రాజవరం వెళ్లి పింఛన్ అందజేత


పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చక్రధర్

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు సాయిరామ్ కాలనీకి చెందిన డీఎంహెచ్‌వో పింఛన్ లబ్ధిదారుడు కామర్సు కృష్ణమోహన్ ఉండ్రాజవరంలో ఆయన కుమార్తె ఇంటి వద్ద చికిత్స కోసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు సోమవారం కోలమూరు సచివాలయం 1 వలంటీర్ పీఎస్వీ చక్రధర్ ఉండ్రాజవరం వెళ్లి రూ.5 వేల పింఛన్‌ను ఫేస్ రికగ్నైజ్ ద్వారా అందించారు. వలంటీర్ చక్రధర్‌ను పంచాయతీ కార్యదర్శి విజయ్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులు అభినందించారు.

17 నుంచి సర్టిఫికెట్ కోర్సులు

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణా మండలి ఆధ్వర్యంలో బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గవర్నమెంట్ పాలిటెక్నిక్‌లో ఆటోక్యాడ్, వెబ్ డిజైన్, ఆఫీస్ ఆటోమేషన్ సర్టిఫికెట్ కోర్సులను ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఈ కోర్సుల వ్యవధి మూడు నెలలు ఉంటుందని, పదో తరగతి, ఆపై చదివిన వారు అర్హులన్నారు. వీటికి సంబంధించిన తరగతులను కళాశాలలో నిర్వహిస్తామన్నారు. ఒక్కో కోర్సుకు రూ.6 వేలు ఫీజు చెల్లించాలని, శిక్షణ తర్వాత విజయవాడలో నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు మంజూరు చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు కళాశాల మెకానికల్ డిపార్ట్‌మెంట్‌లో ఈ నెల 7వ తేదీ లోగా సంప్రదించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- తరలివచ్చిన భక్తులు


లాలాచెరువు గోవింద క్షేత్రంలో స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

సీటీఆర్ఐ: ముక్కోటి ఏకాదశి సందర్భంగా రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల్లోని ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆయా ఆలయాల వద్ద కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. దేవీచౌక్‌లోని మఠంవీధి వేంకటేశ్వరస్వామి ఆలయం, లాలాచెరువులోని గోవింద క్షేత్రం, ఆర్యాపురంలోని సత్యనారాయణస్వామి ఆలయం, వంకాలయవారి వీధిలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, మెయిన్ రోడ్డులోని అష్టలక్ష్మి ఆలయం, జమీందార్ మెట్టలోని వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో భక్తులు కిటకిటలాడారు. జమీందార్‌మెట్టలో త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

రూరల్ మండలంలో..

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని వేంకటేశ్వరనగర్‌లోని భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4.30 గంటల నుంచే భక్తులు ఉత్తరద్వార (వైకుంఠద్వారం) దర్శనం చేసుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గొందేశి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో ఆలయ అర్చకులు అంగర వల్లీకాంతాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. మధ్యాహ్నం నుంచి మేళతాళాలతో స్వామివారి ఊరేగింపు ఆలయం నుంచి బయలుదేరి రామకృష్ణానగర్, నవభారత్ నగర్, రాఘవేంద్ర నగర్ మీదుగా ఆలయానికి చేరుకుంది.

బొమ్మూరు వెంకటగిరికొండపై గల లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ధర్మకర్త కామిని ప్రసాద చౌదరి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు నందూరి శ్రీకృష్ణ పరమాత్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో, రామాలయాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కడియం మండలంలో..

కడియం: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు పోటెత్తారు. దుళ్లలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకంగా ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. వివిధ రకాల పువ్వులతో ఆలయాన్ని అలంకరించారు. అర్చకుడు పెద్దింటి లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తెల్లవారుజాము నుంచే భక్తులను దర్శనానికి అనుమతించారు. రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కడియపులంక హరిహర మహాక్షేత్రం, వేమగిరి, కడియం, జేగురుపాడు, వీరవరం తదితర గ్రామాల్లోని వైష్ణవ ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

ప్రత్యేక పూజలు

ధవళేశ్వరం: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు దంపతులు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ సాధనాల చంద్రశేఖర్(శివ), వైఎస్సార్ సీపీ నాయకులు సత్యం వెంకటరమణ, శ్రీరంగం బాలరాజు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి నామా పెద్దిరాజు పాల్గొన్నారు.


బొమ్మూరు వేంకటేశ్వరనగర్‌లోని స్వామివారు


దుళ్ల వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తుల క్యూ


ధవళేశ్వరంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు దంపతులు


స్వామికి హారతి ఇస్తున్న రామానుజ జీయర్ స్వామి

టీడీపీ ఇన్‌చార్జి పదవికి రాజీనామా చేస్తున్నా

- చంద్రబాబు అసహనమే కారణం
- మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్

సీటీఆర్ఐ: పార్టీ అధినేత చంద్రబాబు తనపై అసహనం వ్యక్తం చేయడంతో రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి పదవికి రాజీనామా చేస్తున్నానని మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ ప్రకటించారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పార్టీ శ్రేణులతో కలిసి చంద్రబాబుతో ఇటీవల సమావేశమైనప్పుడు మనసు విప్పి మాట్లాడానన్నారు. వారం తర్వాత మరోసారి భేటీ అయినపుడు తనపై చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారన్నారు. పార్టీ ఇన్‌చార్జిగా మరొకరిని నియమించాలని కోరానన్నారు. ఇంతవరకూ ఎవరినీ నియమించలేదన్నారు. తన వలన పార్టీకి నష్టం కలగకూడదన్న ఉద్దేశంతో ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పుకుంటున్నానన్నారు. టీడీపీలోనే కొనసాగుతానని తెలిపారు. పార్టీ కార్యకర్తగా ఉంటూ ఏ పని అప్పగించినా చేస్తానని అన్నారు. మరో పార్టీకి వెళ్లే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులకు సోమవారం మాజీ ఎంపీటీసీ నక్కా శ్యాంబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేసి, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మార్చారన్నారు. హెచ్ఎం సుధాకర్ బాబు పాల్గొన్నారు.

4న సీపీఐ కార్యవర్గ సమావేశం

ప్రకాశం నగర్: ఈనెల 4న జరిగే సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మధు మాట్లాడుతూ సమావేశానికి కార్మికులు, కర్షకులు తరలిరావాలని పిలుపు నిచ్చారు. పార్టీ సహాయ కార్యదర్శి జట్లు లేబర్ యూనియన్ అధ్యక్షుడు కుండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోకుంటే ఆందోళన

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్‌పై విధులు నిర్వహిస్తున్న ఇరిగేషన్ ఉద్యోగి ఎస్.ఆలీసురాజుపై దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోకుంటే 4వ తేదీ నుంచి రిలే నిరాహార దీక్ష చేపడతామని ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ లస్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి జీజే విక్రమ్ అన్నారు. తమకు న్యాయం చేస్తామని నూతనంగా ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు హామీ ఇచ్చారన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సైకిల్ యాత్ర

రాజానగరం: పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అంటూ ఇద్దరు మిత్రులు కాశ్మీర్ నుంచి పూణే వరకు సైకిల్ యాత్రను చేపట్టారు. జాతీయ రహదారి మీదుగా విజయవాడ వైపుగా వెళ్తున్న కాశ్మీర్‌కి చెందిన మిలాస్ కుమార్, పరదేశీ సోమవారం రాజానగరం చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలుష్యం పెరిగిపోవడంతో ఆరోగ్యకర పంటలను పండించలేకపోతున్నామన్నారు. కాలుష్య నియంత్రణపై ప్రజలలో చైతన్యం రావడం కోసం కాశ్మీర్‌లో సైకిల్ యాత్ర ప్రారంభించామన్నారు. ఇంతవరకు 3400 కిలోమీటర్లు ప్రయాణించామన్నారు.

సీఎం కాన్వాయ్ ట్రయల్ రన్

సీటీఆర్ఐ: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పర్యటనకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయని మంత్రి వేణు అన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీఎం సభ ప్రాంగణాన్ని మంత్రులు, అధికారులు సోమవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసుల ఆధ్వర్యంలో ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ ఇచ్చిన హామీల మేరకు అన్ని వర్గాల సంక్షేమానికి పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌ను ఆశీర్వదించడానికి పెద్దసంఖ్యలో ప్రజలు రానున్నారన్నారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో నిరుపేదలకు సామాజిక భద్రత పెన్షన్లు ఇవ్వడం లేదన్నరు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ గ్యాలరీల వారీగా అధికారులు తమకు నిర్దేశించిన విధంగా ముందస్తుగా సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, సీఎం జగన్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఎమ్మెల్యేలు తలారి వెంకటరావు, కైలా అనిల్ కుమార్, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, ఇన్‌చార్జి ఎస్పీ సుధీర్‌కుమార్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ పాల్గొన్నారు.


ఆర్ట్స్ కళాశాల మైదానంలో సిద్ధమైన సభా ప్రాంగణం

జగన్‌కు ఘన స్వాగతం పలకాలి


విలేకరులతో మాట్లాడుతున్న జక్కంపూడి గణేష్

రాజమహేంద్రవరం సిటీ: నవరత్నాల పథకాలతో ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తూ జనరంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంగళవారం రాజమహేంద్రవరం రానున్నారని, ఆ పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నాయకుడు జక్కంపూడి గణేష్ పిలుపు నిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి.. మళ్లీ బంపర్ మెజారిటీతో అధికారంలోకి వస్తారన్నారు. మూడో విడత పింఛన్ల పెంపును ఆయన రాజమహేంద్రవరంలో లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ బొంతా శ్రీహరి, వైఎస్సార్ సీపీ నాయకులు నరవ గోపాలకృష్ణ, మరుకుర్తి నరేష్ కుమార్ యాదవ్, కొత్తపేట రాజా పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ మృతి

కడియం: స్థానిక కెనాల్‌రోడ్డుపై ఆదివారం రాత్రి ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్న ఘటనలో గాయపడిన ఆటో డ్రైవర్ ముదునూరి రాంబాబు (46) రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కడియం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరంలోని దానవాయిపేటకు చెందిన రాంబాబు తన స్నేహితులతో కలిసి ఆదివారం రాత్రి ఆటోలో మండపేట వెళ్లాడు. తిరిగి వస్తుండగా కడియం పోలీస్‌స్టేషన్ సమీపంలోని కెనాల్ రోడ్డుపై ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాంబాబుతో పాటు, అతని స్నేహితుడు గుర్రపు శ్రీనివాసు కూడా గాయాలపాలయ్యారు. రాంబాబుకు తల, కాళ్లు, చేతులపై రక్తపు గాయాలు కావడంతో అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. శ్రీనివాసు చికిత్స పొందుతున్నాడని పోలీసులు తెలిపారు. ఎస్ఐ ఆంజనేయులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంగారాణికి అవార్డు


మంగారాణి

కంబాలచెరువు: తిరుపతికి చెందిన మహాత్మా జ్యోతిరావు పూలే ఫౌండేషన్ సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా మహిళలకు అందజేస్తున్న అవార్డుకు స్థానిక నాగరాజా పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.మంగారాణి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆమె సోమవారం ఆ వివరాలను తెలిపారు. తిరుపతిలో మంగళవారం జరగబోయే కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా మంగారాణి అవార్డు అందుకోనున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

కంబాలచెరువు: స్థానిక ఆర్వీ నగర్‌లో పోతుల రమేష్ (35) అనే వ్యక్తి సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాల్లోకెళితే... తుమ్మలావ సమీపంలోని నటరాజ్ థియేటర్ సమీపంలోని చర్చి పాస్టర్ వద్ద రమేష్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడు సీతానగరం సమీపంలోని కాటవరంలో నివాసం ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో రమేష్ కోరుకొండ రోడ్డులోని ఆర్వీ నగర్‌లో ఉంటున్న సంఘ విశ్వాసుల ఇంటికి వచ్చాడు. ఆదివారం రాత్రి అక్కడే ఉన్నాడు. మర్నాడు ఉదయం ఇంటిలో వారు లేచి చూసేసరికి చున్నీతో ఫ్యానుకు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఇదిలావుండగా రమేష్ అందరితో చాలా సరదాగా ఉంటాడని, ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఎందుకు వచ్చిందని పలువురు అంటున్నారు. రమేష్‌ది హత్య, ఆత్మహత్య అనేది పోలీసుల దర్యాప్తులో తెలియాల్సివుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతడి తల్లి రాహెల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాష్ట్రంలో జగనన్న సంక్షేమ విప్లవం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- కోరుకొండ నరసన్నకు పూజలు


కోరుకొండలో అన్నప్రసాద వితరణ చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


సీతానగరంలో వేణుగోపాలస్వామి

మధురపూడి: అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి పథకాలు అమలు చేస్తూ సీఎం జగన్ రాష్ట్రంలో సంక్షేమ విప్లవం సృష్టించారని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. సోమవారం కోరుకొండ నరసింహస్వామిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చక స్వాముల మంత్రోచ్ఛారణతో ఎమ్మెల్యే రాజాను ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జగనన్న పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను గుర్తించి వాటి పరిష్కారంలో భాగంగా నవరత్నాలను అమలు జరుపుతున్నారన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామిని కోరుకున్నట్టు తెలిపారు. ముందుగా ఆయన తులసీ లాలు సమర్పించారు.

తరలివచ్చిన భక్తులు

ముక్కోటి సందర్భంగా లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. తెల్లవారుజామునే పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రంగరాజ బట్టర్, అర్చక స్వాములు పెద్దింటి చంటిబాబు, పెదపాటి గిరిధర్, కోరుకొండ ఎంపీపీ ఉల్లి వీరవెంకట సత్యసూర్యకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముక్కోటి ఏకాదశి

సీతానగరం: ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సీతానగరంలోని విష్ణాలయంలో కొలువైన రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామికి ఆలయ అర్చకుడు కేశవాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మదాయ, దేవదాయశాఖ ఈవో సోమాల శివ, ఆలయ కమిటీ చైర్మన్ సలాది వాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కొడమంచిలి శ్యామలరావు గురుస్వామి, రాముస్వామి ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణం జరిపారు. వంగలపూడిలోని సీతారామస్వామి, రఘుదేవపురం దాసాంజనేయస్వామి ఆలయాలకు భక్తులు తరలివచ్చారు. జాలిమూడిలోని లక్ష్మీనరసింహస్వామి, మునికూడలిలోని సత్యభామా రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయాలు కిటకిటలాడాయి.

లారీని ఢీకొన్న ప్రైవేటు బస్సు

క్లీనర్ మృతి.. ఐదుగురికి గాయాలు

రాజానగరం: జాతీయ రహదారిపై శ్రీరామనగర్ వద్ద ముందు వెళ్తున్న లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఐదుగురు గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి సోమవారం శ్రీకాకుళం వెళ్తున్నబస్సు ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. విజయనగరం జిల్లా బాబామెట్టకు చెందిన బస్సు క్లీనర్ కొత్తపల్లి శ్రీను (35) అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై ఎస్సై సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పసికందుల మృతిపై ఆరా

కంబాలచెరువు: చెత్త పొదల్లో లభ్యమైన లభించిన పసికందుల మృతదేహాల ఘటనపై పోలీసులు ఆరాతీస్తున్నారు. స్థానిక కోటిలింగాల రేవు వద్ద ఇద్దరు పురిటి బిడ్డలను పొదల్లో వదిలివేయడం, వారు కుక్కల పాలై మృతి చెందడం ఆదివారం చోటుచేసుకున్న సంగతి విదితమే. వీరిద్దరి మృతదేహాలను రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతిచెందిన ఆ చిన్నారులు ఎవరి తాలూకా అనే విషయాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. స్థానికంగా ఉన్న వారే ఎవరైనా ఈ విధంగా చేశారా, ఎక్కడి నుంచైనా వచ్చి పిల్లలను పడేసారా అనే విషయం తెలియాల్సివుంది. మూడు రోజుల వరకు వేచి చూసి తల్లిదండ్రుల ఆచూకీ లభించని పక్షంలో పోలీసులే ఆ ఇద్దరికి చిన్నారులకు అంత్యక్రియలు నిర్వహిస్తారు.